సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

గంగుల కమలాకర్‌తో కలిసి అభివాదం చేస్తున్న గులాం అహ్మద్ హుస్సేన్

- తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

కలెక్టరేట్, నవంబర్ 8: తెలంగాణలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించబోతున్నారని ఎంఐఎం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ నామినేషన్ సందర్భంగా నగరంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఐఎం కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ నాలుగోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, అతీఫ్ అతీన, ఎంఐఎం కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, షర్ఫొద్దీన్, నాయకులు అలీబాబా, అజర్ దబీర్, 36 డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- భవిత కేంద్రాల ద్వారా ఐఈఆర్పీ సేవలందించాలి
- వైద్యుల సేవలు అభినందనీయం
- కలెక్టర్ పమేలా సత్పతి
- మాతాశిశు ఆరోగ్య కేంద్రం సందర్శన

విద్యానగర్, నవంబర్ 8: గర్భధారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంతానోత్పత్తి సమస్యలను అర్థం చేసుకోవడంపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి మొదలు కొని రెండో అంతస్థులోని చిన్న పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ కేంద్రం వరకు ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అక్కడ వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఫిజియోథెరపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన పిల్లల పరిస్థితులు, వారికి అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఐన్ క్యూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ద్వారా సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, మాతృత్వం అనేది గొప్పవరమని అన్నారు. అంతకు ముందు ఓపీ రిజిస్ట్రేషన్, నిర్వహిస్తున్న రిజిష్టర్లు, స్కానింగ్, వైద్య పరీక్షలను పరిశీలించారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మాతాశిశు కేంద్రానికి గర్భిణులను తీసుకువచ్చే ముందు ఆయా పీహెచ్‌సీ డాక్టర్ల రిఫరెన్స్‌ను కూడా నమోదు చేయాలని, తద్వారా కేసు వివరాలను త్వరగా తెలుసుకునే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడా లింగనిర్ధారణ జరుగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని, ఎవరైనా లింగ నిర్ధారణకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దవాఖానలోని ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ దవాఖాన నిర్వహణ, అందిస్తున్న వైద్య సేవలు చాలా బాగున్నాయని వైద్యాధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, డీసీహెచ్ కృష్ణప్రసాద్, ఆర్ఎంవో జ్యోతి, డాక్టర్ అలీం, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

రాంనగర్, నవంబర్ 8: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని హుజూరాబాద్‌లో ఏసీపీ జీవన్ రెడ్డి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 123 మంది పోలీసులతో హుజూరాబాద్‌లో 4.5 కిలోమీటర్ల మేర కవాతు నిర్వహించామన్నారు. ఈ కవాతులో కేంద్ర సాయుధ బలగాలతో పాటు జిల్లా పోలీసులు, స్థానిక పోలీస్ అధికారులు, డాగ్ స్క్వాడ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీంలు పాల్గొన్నాయన్నారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు కేటాయించారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు కేంద్ర సాయుధ బలగాలు జిల్లా అధికారులతో కలిసి పని చేస్తాయన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భద్రతా దృష్ట్యా ఎనిమిది కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు కేటాయించగా, ఇప్పటికే మూడు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. వారిని ప్రస్తుతం హుజూరాబాద్, చొప్పదండి, కరీంనగర్‌కు కేటాయించామన్నారు. ప్రజల్లో ఎన్నికల నియమావళి, ఉల్లంఘనపై అవగాహన, 100 డయల్, 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ-విజిల్ యాప్‌పై అవగాహన కల్పించామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా భావాన్ని కల్పించడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే రాజకీయ ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను పిలిపించి ప్రజల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరించామన్నారు. ఫ్లాగ్ మార్చ్ అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహించి, నంబర్ ప్లేట్, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 21 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ జీవన్ రెడ్డి, బీఎస్ఎఫ్ ఏసీపీ అనుజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్, కిశోర్, రమేశ్, సంతోష్‌కుమార్, ఎస్ఐలు ఎండీ ఆసిఫ్, రాజ్‌కుమార్, డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్రబలగాలు

వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వాహనాల తనిఖీ

వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చొప్పదండి, నవంబర్ 8: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు హాజరైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు చేపట్టిన తనిఖీలకు వినోద్‌కుమార్, సుంకె రవిశంకర్ సహకరించారు.

సుంకె నామినేషన్‌కు మద్దతుగా తరలిన నాయకులు

బోయినపల్లి, నవంబర్ 8: చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ బుధవారం చొప్పదండిలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా బోయినపల్లి నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర నాయకుడు జోగినపల్లి ప్రేమ్ సాగర్‌రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల సుధాకర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు నామినేషన్‌కు మద్దతుగా తరలివెళ్లారు.

నాలుగు నామినేషన్లు దాఖలు

చొప్పదండి, నవంబర్ 8: చొప్పదండి నియోజకవర్గం పరిధిలో బుధవారం ఐదో రోజు నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రపుల్‌దేశాయ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరపున సుంకె రవిశంకర్, బీజేపీ నుంచి బొడిగ శోభ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బంగారి మాధవ, బీఎస్పీ నుంచి కొనకంటి శేఖర్ రెండు సెట్లు నామినేషన్ వేసినట్లు తెలిపారు.

సుంకె రవిశంకర్ గెలువాలని పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్యాల, నవంబర్ 8: రాంపూర్‌లోని భావనగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయంలో చొప్పదండి ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలువాలని పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేసి, ముడుపు కట్టారు. పూజల్లో బీఆర్ఎస్ నాయకులు క్యాతం భూపతిరెడ్డి, బొంకూరి వేణురావు, గంగారాజం, శ్రీగాదె విష్ణు, గంగారావు, సంగ ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

తెలంగాణచౌక్, నవంబర్ 8: కేంద్ర ప్రభుత్వం బీసీల జీవితాలతో ఆడుకుంటున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయం (బద్ధం ఎల్లారెడ్డి భవనం)లో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీని తొలగించి బీసీని ముఖ్యమంత్రి ఎలా చేస్తారని ప్రశ్నించారు. బీసీ వర్గానికి చెందిన ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు ఏమి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్ల పాలనలో దేశంలో 70 కోట్ల మంది బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కొయ్యడ సృజన్ కుమార్, సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, బోయిన అశోక్, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.